# దారిలో దొరికిన ప్రేమలేఖలు



## – ???

*ఎవరు వ్రాశారో తెలియదు, ఎవరికి వ్రాశారో తెలియదు. దొరికిన ప్రేమలేఖల సంపుటినుంచి నెలకో ప్రేమలేఖ !!*



## -5-

**నా అలంకారీ!**

నీ రూపమూ, నీ ఉత్సాహమూ, నీ సౌందర్యమూ, నా మనస్సులో పదిలపరుచుకోకపోతే నేను ఏమైపోయి ఉండేవాడినో! ఎంత నిరుత్సాహపు క్షణాల్లో నీవు నా మనస్సులో ప్రవేశించావు! కేవలం నిన్ను చూడాలనీ నిన్ను నా కనుల నిండుగా నిలుపుకోవాలన్న తపన మాత్రమే నా జీవితానికి మూలాధారం అంటే నమ్మగలవా? నమ్మకపోయినా నేను విచారించను ప్రాణమా!

యీ లోకపు రీతీ, యీ లోకపు నిర్దయా తెలియని దేవతవి నువ్వు! నీ దయాహృదయంతో ఓదార్పునీ ప్రేమనూ, ఉత్సాహాన్నీ, మాత్రమే పంచగలిగిన దైవాత్మవి నువ్వు. యీ లోకపు వెకిలి మాటలూ పనికిమాలిన చేష్టలూ నీకెలా తెలుస్తాయీ?

చల్లగా ప్రవహించే కాలం నిర్మలమైనదైనా సంఘటనల వరదలు వచ్చినప్పుడు ఆ శీతల కాలప్రవాహమే ఎంత మలినమౌతుందో ఎలాగూ వివరించడం?

యీ లోకాన్ని గురించీ, యీలోకపు రీతీ, నీతీ గురించి ఎన్నో, ఎంతో వ్రాయాలనిపిస్తుంది! కానీ, అదంతా రాసి, స్వచ్ఛమూ స్వతంత్రమూ ఆనందప్రేరకమూ అయిన నీ మనస్సుని వ్యాకులపాటుకు గురిచేస్తానేమో అన్న భయం నన్ను అదిలిస్తూనే ఉంటుంది. అయినా, ఇటువంటి దుష్టరీతుల్ని గురించి ఎందుకూ వివరించడం?

నీవో పూలతోటవి. కమ్మని సువాసనలు వెదజల్లుతావుగా! ఇక నేనా? యీ లోకపు మురికి వీధులనీ, పేదరికపు దుర్గంధాన్నీ, ఏమీ చేయలేని నిస్సహాయతా దౌర్బల్యాన్నీ పుణికి పుచ్చుకున్నవాడ్ని. నీ ఛాయల్లోకి అడుగుపెట్టగానే, నా పేదరికపు దుర్గంధమూ నిస్సహాయతా దౌర్బల్యమూ నన్ను వీడిపోయి నాకు ఉత్సాహాన్నీ ఆనందాన్నీ, జీవితం మీద ఆశనీ కలుగచేస్తాయి. అద్భుతమైన నీ సాంగత్యంలో నా విషాదపు గీతాల్నీ రోదనలనీ ఎందుకూ వినిపించడం? పేదరికం వేఱుపురుగులాంటిది! అది జీవిత సౌందర్యాన్నీ సాహిత్యపిపాసనీ, అన్నిటినీ అంతటినీ కొరికివేసి జీవన వృక్షాన్నే కూలదోస్తుంది. అందుకే నా జీవనాధారమా..! నీ ఎదుట అలాంటి బాధామయ ప్రస్తావనలు తెచ్చేకంటే, నీ దయనిండిన సౌందర్యపు ఛాయల్లో విశ్రమించడమే మేలని అనిపిస్తోంది. కానీ నేనూ ఓ నిర్భాగ్యజీవినే! అందుకే బహుశా నా కష్టాలనీ బాధలనీ నీతో చెప్పుకోవాలనే తపన.

యీ కష్టాలూ బాధలూ కేవల భ్రాంతి మేఘాలు కావచ్చు! యీ క్షణాన మనోకాశాన్ని ఆక్రమించి మరోక్షణపు ఉత్సాహపు ప్రభంజనంతో వీగిపోవచ్చు. ఒక్కొక్కప్పుడు కేవలం నా చేతకానితనానికి ఋజువేకావచ్చు. కానీ, ఇదీ ఓ జీవితహేల. నీ ఎదుట ఏమీ

దాచుకోవాలనిలేదు. అంతేకాక, నాదన్న సర్వం నీ ఎదుట సమర్పించాలని ఉంది. నా అహంభావాన్నీ, నా భ్రమాపాశాల్నీ అన్నిట్నీ నీ ఎదుట పెట్టాలని ఉంది. ఏ నీటి చుక్కకోసం ఏ ముత్యపుచిప్ప నోరు తెరుచుకుందో!

ఏ నీ చల్లటి చూపుని ఏ అక్షరం నోచుకుందో!

ఎలాగూ నిర్ణయించటం!!? నా జీవితం దీపమైతే, వెలుగులు చిమ్మే ఎప్పటికీ నశించని కాంతివి నీవుగా భావిస్తూ

నీ

-X-



*(వచ్చేనెల మరో ప్రేమలేఖ)*

Post your comments